ప్రజాశక్తి
శనివారం 10 ఫిబ్రవరి 2024



14న మార్కెట్ ఆశీలు, మున్సిల్ షాపుల వేలం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ రోజువారీ మార్కెట్, మున్సిపల్ పరిధిలో గల పలు ఏరియాల్లో రోడ్డు మార్జిన్ ఆశీలు వసూళ్ల చేసుకునేందుకు వేలం పాట ఈనెల 14 జరుగుతుంది. మున్సిపల్ అధీనంలో ఉన్న మున్సిపల్ వాణిజ్యభవన సముదాయంలో ఉన్న 22, 34,36,44,45, నెంబర్ల షాప్‌లను అద్దె ప్రాతిపదికన వేలంపాట కమిషనర్ పి.సింహాచలం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బహిరంగగా నిర్వహించనున్నారు. మార్కెట్ ఆశీలు వేలం పాటలో పాల్గొనే వారు రూ.5 లక్షలు సాల్విన్ సర్టిఫికేట్‌తో పాటు రూ.4లక్షలు ధరావత్తు మున్సిపల్ రెవెన్యూ అధికారులకు అందజేసి వేలం పాటలో పాల్గొనాలని మున్సిపల్ కార్యాలయ అధికారులు పేర్కొన్నారు.

కోటదుర్గమ్మ ఆలయ బోర్డు పదవికి పోటీ

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలోని ఎంతో ప్రఖ్యాత దేవాలయంగా గుర్తింపు పొందిన కోటదుర్గమ్మ ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్ష పీఠానికి గట్టి పోటీ నే కనిపిస్తుంది. అధ్యక్ష పీఠం కోసం పట్టణానికి చెందిన పలువురు అధికార పార్టీ నాయకులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఏడాదికి సుమారు అరవై లక్షలకు మించి ఆదాయం రావడంతో పాటు ఎంతో ప్రాముఖ్యత కలిగిన దేవాలయం కావటంతో నేతల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అయినప్పటికీ ఇంతవరకు కమిటీని నియమించుకోలేని పరిస్థితి ఉంది. దీంతో ప్రజల్లో కూడా తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా జరుగుతున్న దసరా ఉత్సవాలు కూడా కమిటీ లేకుండా జరుగుతున్నాయి. ఆలయ అభివృద్ధికి స్థానిక కమిటీ అవసరమైనప్పటికీ అధికార పార్టీలో వర్గ పోరు కారణంగా కమిటీ నియామకం జరగలేదని పట్టణ వాసులు అంటున్నారు.

నోటిఫికేషన్ విడుదలతో ప్రయత్నాల జోరు

ఆలయ కమిటీ కి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయటంతో అధికార పార్టీ నాయకుల ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. చైర్మన్ పదవి ఆశిస్తున్న వారంతా తమ ప్రయత్నాలు తీవ్రం చేస్తున్నారు. ప్రస్తుతం శాసనసభ సమావేశాలు జరుగుతున్న కారణంగా ఆశవాహులు అమరావతిలో తిష్ట వేసి తమ ప్రయత్నాలను చేస్తున్నట్లు తెలిసింది. 15వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి తుమ్మగుంట శంకరరావు ఈ పదవికి పోటీ పడుతున్నట్లు తెలిసింది. ఇప్పటీవరకు ఈయన మేజర్ పంచాయతీలో వార్డు సభ్యునిగా ఉన్నారు. పాలకొండ నగరపంచాయతీ గా మారిన తరువాత రెండుసార్లు ఆయన సతీమణి అనూష కౌన్సిలర్ గా గెలుపొందారు. బలమైన సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా ఉండడం ఆయనకు అనుకూలమైన అంశంగా ఉంది. ప్రభుత్వ విప్ విక్రాంత్ ఆశీస్సులు ఈయనకు ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. మరో కౌన్సిలర్ ప్రతినిధి నీలాపు శ్రీను కూడా ఈ పదవికోసం పోటీ పడుతున్నారు. ఎన్ కె రాజపురానికి చెందిన కౌన్సిలర్‌గా ఈయన సతీమణి శారద గత రెండు పర్యాయాలుగా గెలుపొందారు. ఎమ్మెల్యే మద్దతు కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అయితే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎవరి వైపు మొగ్గు చూపిస్తారో తెలియాల్సి ఉంది.


కోట దుర్గమ్మ గుడి

పిఎసిఎస్ ఆధ్వర్యంలో జనరిక్ మందుల షాపు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జనరిక్ మందుల షాపు ఈనెల 12న ఏర్పాటు కానుంది. శుక్రవారం చైర్‌పర్సన్ కాపారపు సత్యనారాయణ, సిఇఒ సిరిపరపు నారాయణరావు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును కలిసి ప్రారంభోత్సవానికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రప్రథమంగా తన నియోజకవర్గంలో పిఎసిఎస్ తరపున ప్రజలకు వినియోగపడేలా మెడికల్ షాపు ప్రారంభించడం తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యానికి రక్ష

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నులి పరుగుల నివారణ ఆరోగ్యానికి రక్షణ అని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం జిల్లాలో పెద్ద ఎత్తున శుక్రవారం నిర్వహించారు. మండలంలోని బాలేసు పాఠశాలలో నులిపురుగుల నివారణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్త హీనత, పోషకాలు లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. ఆల్ బెండజోల్ మాత్ర వేయడం ద్వారా రక్త హీనత నివారణ, పోషకాలు గ్రహించడం జరుగుతుందని తద్వారా ఏకాగ్రత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 1 నుండి ఐదేళ్ల చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల్లోనూ, 6 నుండి 19 ఏళ్ల విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలలలో పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

16న మాప్ అప్

ఈనెల 16న మాప్ అప్ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. శుక్రవారం వివిధ కారణాల రీత్యా మాత్రలు వేసుకోని వారిని గుర్తించి ఈనెల 16న జరిగే మాప్ అప్ కార్యక్రమంలో వేయిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

మండలంలోని దుడ్డుకల్లు, బాలేసు, భద్రగిరి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు ఉండాలని స్పష్టం చేశారు. విద్యుత్, తాగునీరు, మరుగు దొడ్లు, ర్యాంపు సౌకర్యాలు ఉండాలని, పోలింగ్ నిర్వహణకు అనుకూలత ఉండాలని స్పష్టం చేశారు. వసతుల కొరత ఉండరాదని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని వసతుల కల్పనకు చర్యలు చేపట్టామని ఆయన అన్నారు.


పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టర్ నిశాంత్‌కుమార్


అల్బెండజోల్ మాత్రలు మింగించడాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

భద్రగిరిలో అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అంగన్వాడీ చిన్నారుల అభ్యసన తీరును గమనించారు. చిన్నారుల బరువు, ఎత్తు స్వయంగా పరిశీలించారు. పిల్లల బరువు, ఎత్తు, అభ్యసన స్థాయి నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలని అందుకు తగిన పర్యవేక్షణ ఉండాలని సూచించారు. గర్భిణులకు ఇంటింటికీ రేషన్ పంపిణీ (టేక్ హోమ్ రేషన్) అందించడమే కాకుండా ఆయా గర్భిణీలు మాత్రమే తీసుకునేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. గర్భిణికి అందించిన పౌష్ఠిక ఆహారం కుటుంబ సభ్యులు తీసుకోరాదని స్పష్టం చేశారు. హైరిస్క్ గర్భిణీలను గుర్తించి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. మండలంలో గల రక్త హీనత నివారణ కమిటీ (ఎనిమిక్ ఏక్షన్ టీమ్) సభ్యులుగా ఉన్న ఎఎన్ఎం, ఆశా, అంగన్వాడీ కార్యకర్త, మహిళా పోలీస్ తమ పరిధిలో ఉన్న రక్త హీనత కలిగిన చిన్నారులు, బాలింతలు, గర్భిణీలను గుర్తించాలని ఆదేశించారు. పదేళ్లలోపు వయస్సు గల పిల్లల్లో మరణాల రేటు తగ్గించేందుకు అమలు చేస్తున్న ప్రిజమ్ ప్రాజెక్ట్‌లో భాగంగా చిన్నారుల్లో రక్తహీనతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా దుడ్డుకల్లు పాఠశాలలో విద్యార్థులకు తయారు చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఆహార పదార్థాల తయారీలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత విధిగా పాటించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్ విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 16న సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జెఎసి పిలుపు మేరకు నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు సిద్దాబత్తుల రామచంద్రరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు కోరారు. శుక్రవారం వారు స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బంద్ విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తూ రైతులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాలను విస్మరించిందని అన్నారు. దేశంలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోయారని చెప్పారు. వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం వలస పోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం ఉపాధ్యక్షులు అసిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొమరాడ : దేశవ్యాప్తంగా ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు బంద్ జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని తహశీల్దార్, ఎంపిడిఒ, ఉపాధిహామీ తదితర కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ 16వ తేదీన జరిగిన బంద్‌లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రామారావు, సింహాచలం, అప్పల నాయుడు, సురేష్, మహేష్, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జయకృష్ణ

ప్రభుత్వానికి చెడ్డపేరు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : ఎంపిపి ప్రమీల

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి చెడ్డపేరు తీసుకొచ్చిన జిల్లా అధికారులపై చర్యలు తీసుకోవాలని పాచిపెంట ఎంపిపి బి.ప్రమీల డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలని, క్రీడాకారుల్లో నైపుణ్యాలు వెలికి తీయాలనే మంచి ఆలోచనతో సిఎం జగన్ మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారని చెప్పారు. వెనుకబడిన నియోజకవర్గం, మారుమూల గిరిజన మండలం నుంచి యువకులు జిల్లా స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీల్లో విజయం సాధించడం గొప్ప విషయమని అన్నారు. సాక్ష్యాత్తు జిల్లా కలెక్టర్, డిఎస్‌డిఓల చేతులు మీదుగానే పాచిపెంట క్రికెట్ జట్టును అభినందిస్తూ ట్రోఫీ, ప్రశంసా పత్రాలు అందజేశారని చెప్పారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన పాచిపెంట టీం ను రాష్ట్ర స్థాయి పోటీలకు అనర్హులని చేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి వుందని చెప్పారు. అత్యంత పారదర్శకంగా జరిగిన క్రీడాకారుల్లో కొంతమంది అధికారుల అత్యుత్సాహం వల్లనో, మరే ఒత్తిళ్ల వల్లనో గెలిచిన పాచిపెంట టీం ని ఫైనల్స్ కి వెళ్ళకుండా చేయడం అన్యాయమని అన్నారు. సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఈ వ్యవహారంపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపిపి ప్రమీల డిమాండ్ చేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - కురుపాం

వేసవిని దృష్టిలో పెట్టుకొని ముందస్తు జాగ్రత్తగా జిల్లాలో ప్రతి గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందుస్తు చర్యలు చేపడుతున్నామని జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జి సిఇఒ కె.రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి మండల పరిషత్ వార్షిక బడ్జెట్ నిధులు ఖర్చులు, వివరాలు తనిఖీలు, 15 ఫైనాన్స్ నిధులు ఏ స్కీంలకు ఉపయోగించాలి తదితర తనిఖీలు నిమిత్తం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 34 మండలాలకు 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.16 కోట్లు విడుదల చేశామని, ఇప్పటి వరకు రూ.8కోట్లు ఖర్చు పెట్టారని, ఇంకా రూ.8కోట్లు కూడా ఖర్చు పెట్టమని చెబుతున్నామని అన్నారు. ప్రతి మండలం నుంచి తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా ఇప్పటికే ఎంపిడిఒల దగ్గర నుండి బోర్లుకు ఎంత మెటీరియల్ కావాలో జాబితా తీసుకున్నామని తెలిపారు. తాగునీటి ఎద్దడి లేకుండా 15వ ఆర్థిక సంఘం నిధులు ఉపయోగించామని, ఇంకా రూ.16 కోట్లు జిల్లాకు వచ్చి ఉందని, అది త్వరలో విడుదల చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.అప్పారావు, ఇఒపిఆర్‌డి జి.రమేష్‌బాబు , జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఒపిఎస్ ఇచ్చిన వారికే మా ఓటు

పోస్టరు విడుదల చేసిన యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- పార్వతీపురం

సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ ఇచ్చిన వారికే మా ఓటు అనే నినాదంతో పోస్టరును యుటిఎఫ్ జిల్లా నాయకత్వం శుక్రవారము స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద విడుదల చేసింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన రావు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ తీసుకొస్తానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారని, మడమ తిప్పారని ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసగించారని విమర్శించారు. రానున్న ఎన్నికలలో ఒపిఎస్ ఒక రాజకీయ ఎజెండాను మార్చడానికి ఉద్యమాన్ని చేస్తున్నామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు కుటుంబ సభ్యులు రాజకీయ నాయకుల భవితవ్యాన్ని నిర్ణయం చేయబోతున్నారని అన్నారు. ఈ సందర్భంగా డిఇఒ కార్యాలయం, ఎస్ఎస్ఎ సిబ్బందిని కలిసి ఒపిఎస్ ఇచ్చిన వారికే మా ఓటు అన్న నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, కోశాధికారి కె.మురళి, జిల్లా కార్యదర్శులు కె.భాస్కర రావు, యన్. శ్రీను, పి. వెంకట నాయుడు, గోవిందమ్మ, మండల నాయకులు పాల్గొన్నారు.

14న నారా లోకేష్ శంఖారావం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఈనెల 14న పార్వతీపురంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించే శంఖారావం బహిరంగ సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి బోనెల విజయచంద్ర పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14న నారా లోకేష్ బహిరంగ సభ పార్వతీపురంలో జరగబోతోందని, ఈ నేపథ్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేయడానికి నిర్ణయించామని తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వీరఘట్టం : ఈనెల 13న పాలకొండలో జరగనున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక జామీ వారి కాంప్లెక్స్‌లో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్న ప్రత్యక్ష బాధ్యత తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, అరకు పార్లమెంటు తూర్పు కాపు అధ్యక్షులు పి.కృష్ణమూర్తి నాయుడు, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, తెలుగు యువత మండల అధ్యక్షులు మాచర్ల అనిల్, బల్ల హరిబాబు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు శశికుమార్, పి.మహేష్, దళిత సంఘం మండల అధ్యక్షులు రాయపల్లి రత్నాకర్, జనసేన, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని నీరుగార్చేలా అధికారుల చర్యలు : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చేలా ఉపాధి కూలీలను పనికి రానీయకుండా పొగపెట్టేలా అధికారులు రోజుకొక విధానాలు అమలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు వలసలు నివారణకు గానూ ఆర్థికంగా అన్ని విధాలా ఆదుకునేలా గ్రామాల్లో పని చేసుకొనేలా ఈ చట్టాన్ని అధికారులు పేదలకు, కూలీలకు పని కల్పించడంలో జాప్యం జరుగుతుందని తెలిపారు. మౌలిక వసతులు కల్పించడంలో జాప్యం జరగడంతో పాటు ఉపాధి కూలీలు పనికి వెళ్లేలా చేయకున్నా దూరం చేసేలా నిబంధనలు ఉన్నాయని అన్నారు. మౌలిక వసతుల్లేవని, మంచినీరు, టెంట్లు, పనిముట్లు, మెడికల్ కిట్లు లేని పరిస్థితి ఉందని అన్నారు. కావున వెంటనే ఉపాధి కూలీలకు అన్ని విధాలా మంచి సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని, లేనిచో భవిష్యత్తులో అన్ని గ్రామాల్లో ఉన్న ఉపాధి కూలీలతో కలిసి ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.

తాగు నీటి సమస్యపై టిడిపి ఆందోళన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని డోకిశీలలో గత పది రోజులుగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై శుక్రవారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలెట్ పథకంలో సాంకేతిక సమస్యల వల్ల 12 రోజులుగా గిరిజన గ్రామాల్లో నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీనిపై అధికారులు స్పందించి కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాటు కూడా చేయకపోవడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. తాగునీటి కోసం మహిళలు చాలా దూరం నుంచి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. నీటి కోసం మహిళలు పడుతున్న పాట్లు కలచి వేసిందని, అంతేకాక గ్రామంలో కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు స్పందించి చొరవ చూపాలని విజయ చంద్ర అధికారులను కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సామాజిక తనిఖీపై సమావేశం

వెలుగు చూసిన లోపాలు

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక ఉపాధి కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ చట్టం 2022-23 ఆర్థిక సంవత్సరానికి గానూ మండలంలోని రూ.13 కోట్లతో చేసిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందం డిఆర్పీలు 29 పంచాయతీల్లో జరిగిన పనుల్లో లోపాలను చదివి వినిపించారు. సుమారు 15 మంది వాలంటీర్లకు మూడు రోజులు మించి పనులు కల్పించడం, బొర్రమామిడి, పద్మాపురం, మిలియాకంచూరు పంచాయతీల్లో అత్యధికంగా మృతి చెందిన వారి పేర్లు మీద వేతనాలు చెల్లింపులు, మస్తర్లో సంతకాలు, వేలిముద్రలు లేకుండా బిల్లులు చెల్లింపులు, పనులు సక్రమంగా కల్పించకపోవడం, 80శాతం మొక్కలు క్షేత్రస్థాయిలో లేకపోవడం, కొలతల్లో తేడాలు, దస్త్రాలు సక్రంగా నిర్వహించకపోవడం వంటి అనేక లోపాలను సామాజిక తనిఖీల్లో డిఆర్పీలు చదివి వినిపించారు. సమావేశంలో డ్వామా పిడి కె.రామచంద్రరావు ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, ఎంపిపి బి.ప్రమీల, మండల వైసిపి అధ్యక్షులు గొట్టాపు ముత్యాలు నాయుడు, నాయకులు దండి ఏడుకొండలు. కొల్లి రవీంద్ర, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎస్ఆర్‌పి తిరుపతిరావు పాల్గొన్నారు.


నివేదికను వెల్లడిస్తున్న డిఆర్‌పిలు


ఒరిగిపోయిన స్తంభం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

సెంటర్ పోల్‌ను తొలగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద 4 రోజుల క్రితం లారీ ఢీకొని ఒరిగిపోయిన సెంటర్ లైటింగ్ పోల్ ను తొలగించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టి, కొత్త ఫోల్‌ను ఏర్పాటు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా, పడాల రాజశేఖర్, ఐద్వా నాయకులు గెద్ద తులసి ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాలిటీలో నాలుగు రోడ్ల కూడలి వద్ద బుధవారం తెల్లవారుజామున వాహనం ఢీకొని సెంటర్ లైటింగ్ పోల్ పడిపోయి మూడురోజులైనా ఇంతవరకు మున్సిపల్ ఇంజనీరింగు అధికారులు తొలగించలేదన్నారు. లైటింగ్ లేని కారణంగా రాత్రి వేళలో వాహనదారులకు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. కావున ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. తక్షణమే సెంటర్ పోల్‌ను తొలగించి కొత్తది ఏర్పాటు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పల్లి గంగాధర్, వారణాశి శంకరరావు, యువత పాల్గొన్నారు.

36 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని 36 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించినట్లు డిడి అన్నదొర తెలిపారు. ఎల్పి తెలుగు, ఎల్పి హిందీ, పిఇటి స్థాయి పోస్టులను అప్ గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం నుండి అనుమతి వచ్చినందున 36 మందికి స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్లు కల్పించినట్లు తెలిపారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్లు తెలుగు 16, స్కూల్ అసిస్టెంట్లు హిందీ 14, స్కూల్ అసిస్టెంట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ పీడీ 6 ఉన్నాయని తెలిపారు.



స్టోన్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వెంకటరమణ

స్టోన్ ప్లాంటేషన్ పనులు వేగవంతం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో భారీసర్వే కార్యక్రమంలో భాగంగా స్టోన్ ప్లాంటేషన్ పనులను వేగవంతం చేయాలని పాలకొండ ఆర్‌డిఒ ఎ.వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని విక్రంపురంలో స్టోన్ ప్లాంటేషన్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భూ రీసర్వే చేపట్టాలన్నారు. ఆయనతో పాటు తహశీల్దార్ కె.జయప్రకాష్, డిటి సిహెచ్ సత్యనారాయణ, పాల్గొన్నారు.



భారీ పగుళ్లు ఏర్పడిన పంచాయతీ భవనం


ఐదేళ్లకే పంచాయతీ భవనానికి పగుళ్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గడగమ్మలో పంచాయతీ భవనం కాలం చల్లకముందే పగుళ్లు ఏర్పడింది. 2009 లో రూ.13 లక్షల అంచనా వ్యయంతో ఈ భవనం నిర్మించారు. పనులు జరిగినప్పుడు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు చేపట్టడంతో భవనం పునాదులు పగుళ్లు బీటలు వారి దర్శనమిస్తుంది. ప్రజాధనాన్ని కాపాడాల్సిన పర్యవేక్షణ అధికారులు గుత్తేదారు ఇచ్చిన కాసులకు కక్కుర్తిపడడంతో భవనం ఈ స్థితికి చేరుకుందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో తనిఖీ

ప్రజాశక్తి - కురుపాం



రికార్డులు పరిశీలిస్తున్న ఎఎస్‌డబ్ల్యుఒ శ్రీకాంత్

మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని ఎఎస్‌డబ్ల్యూఒ పి.శ్రీకాంత్ శుక్రవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్లో గల విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలు హాజరు శాతం మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్న స్టాక్ రికార్డులను పరిశీలించారు. అనంతరం వార్డెన్ శ్రీనివాస్‌కు ప్రతిరోజు పెట్టిన మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం ప్రతిరోజు విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు.



మరమ్మతులకు గురైన ఫీడర్ అంబులెన్స్

కొత్త ఫీడర్ అంబులెన్స్‌లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు అత్యవసర సమయంలో ఎంతో ఉపయోపడుతున్న ఫీడర్ అంబులెన్స్‌లన్నీ మరమ్మతులకు గురై మూలకు చేరాయని, కావున కొత్తవి మంజూరు చేయాలని సిపిఎం, గిరిజన సంఘం నాయకులు కోరాడ ఈశ్వరరావు, సూకురు ఎర్రయ్య అధికారులను కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు గొప్ప సేవలందిస్తున్న ఫీడర్ అంబులెన్స్ సగానికి పైగా పాడైపోయాయన్నారు. వీటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేసి నడిపించినట్లయితే గిరిజనులకు ఇంకా మెరుగైన వైద్యమందించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐటిడిఎ పరిధిల్లోని ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్లు ఎంతో కష్టపడి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారని అన్నారు. గిరిజనులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలంటే ఫీడర్ అంబులెన్స్ చాలా ఉపయోగకరమని, కావున ఐటిడిఎ పిఒ, కలెక్టర్ స్పందించి కొత్త ఫీడర్ అంబులెన్స్‌లకు బడ్జెట్ కేటాయింపులు చేసి మెరుగైన వైద్యసేవల కోసం కృషి చేయాలని కోరారు.


నగర పంచాయతీలో రోజువారీ మార్కెట్ ఆశీలు వేలం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయితీకి చెందిన రోజువారీ మార్కెట్ ఆసీలు, రోడ్డు మార్జిన్, వారపు సంతలు, చెట్ల ఫలసాయం, కమేళా, వ్యాపారుల రోజువారీ కలెక్షన్ తదితరమైనవి వసూలు చేసుకోవడానికి గానూ 2024-25 సంవత్సరానికి (తేది 01.04.2024 నుండి 31.03.2025 వరకు) సంబంధించిన బహిరంగ వేలం కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు ఆధ్వర్యాన శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో జరిగింది. ఈ వేలంలో ఇద్దుబోయిన మహేష్ రూ. 9,71,000కు పాటను దక్కించుకున్నారు. ఆసీలు వసూళ్లను నగర పంచాయితీ వారి గెజిట్ నియమావళిని అనుసరించి చేపట్టాలని కమిషనర్ సూచించారు. కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాత ఏప్రిల్ 1నుంచి తర్వాత తేది 01.04.2024 నుండి వసూళ్లు చేసుకోవచ్చన్నారు.

పిఎసిఎస్ అధ్యక్షులు దామోదర్

ప్రజాశక్తి - గరుగుబిల్లి



స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులుగా పెద్దూరుకు చెందిన బొబ్బిలి వెంకట దామోదర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గతంలో చైర్మన్‌గా పనిచేసిన బొబ్బిలి అప్పలనాయుడు ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన కుమారుడైన వెంకట దామోదర్‌ను పిఎసిఎస్ అధ్యక్షులుగా నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిరంజీవిచౌదరి నుంచి ఉత్త ర్వులు అందాయని స్థానిక పిఎసిఎస్ సిఇఒ ఎన్.గుంపస్వామి తెలిపారు. పిఎసిఎస్ అధ్యక్షులుగా తనను నియ మించడంపట్ల ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎంపిపి ఉరిటి రామారావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడుకు దామోదర్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన పివి ఈతమనుగూడ, పూతికవలస పంచాయతీల్లో స్థానిక వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ స్థాయిలో సంక్షేమ పథకాలపై అవగాహన నిర్వహించారు. సదస్సుకు హాజరైన గ్రామస్తులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైనప్పటికీ ఇంతవరకూ అందడంలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గ్రామస్థాయిలో భూసమస్యలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, అమ్మఒడి తదితర సమస్యలు ఉన్నట్టు తెలిపారు. గ్రామస్తుల నుంచి వచ్చిన సమస్యలను పరిశీలించి సత్వర చర్యలు చేపడతామని సచివాలయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వెలుగు కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శివాజీ, వెల్ఫేర్ అసిస్టెంట్, వెలుగు అసోసియేషన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్- వై హరిష, అకౌంటెంట్- కృష్ణవేణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ అందరికీ సురక్షితం

పలుచోట్ల డి-వార్మింగ్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు, పెద్దలకు సురక్షితమైనవి అని, వీటి వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో స్థానిక డివిఎం ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఆల్బెండజోల్ టాబ్లెట్లను వేసుకుని నులి పురుగులను నివారించుకుని ఆరోగ్యవంతంగా పిల్లలంతా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం, డిఇఒ జి.పగడాలమ్మ, డిపిహెచ్‌ఒ ఎల్.రమేష్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ దవళ భాస్కరరావు, డాక్టర్ శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు బి.గోవిందు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు: పట్టణంలోని నాలుగో వార్డు అంగన్వాడీ కేంద్ర లో ఐసిడిఎస్ సిడిపిఒ బి.సత్యవతి డి-వార్మింగ్ డే సందర్భంగా పిల్లలకు మందు పంపిణీ చేశారు. అనంతరం తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నులిపురుగుల వల్ల రక్తహీనత ఏర్పడుతుందని, దీని నివారణకు ఈ మందు బాగా పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎఎన్ఎం జయలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల లో విద్యార్థులకు కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు విద్యార్థులకు నులిపురుగుల మందు పంపిణీ చేశారు. పిల్లల నోట్లో చుక్కలు వేశారు. పొట్టలో నులిపురుగుల నివారణ వల్ల రక్తహీనత తగ్గుతుందని చెప్పారు. కావున ఈ మాత్రలను పిల్లలంతా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం లక్ష్మీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సాలూరులో విద్యార్థినికి మాత్రలు వేయిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసరావు

సీతానగరం : జాతీయ నులిపురుగు దినోత్సవ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా లక్షా 75 వేల 891 మంది పిల్లలకు నులిపురుగు మందులు వేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ 1773 ప్రభుత్వ పాఠశాలలు ఒకటి నున్నా మూడు ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగు మాత్రలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.పావని. సూపర్వైజర్ ఉన్నారు.

కురుపాం : జాతీయ నులిపురుగుల దినోత్సవ సందర్భంగా మండలంలోని రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి సిహెచ్ శంకరరావు ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు ఎంపిపి శెట్టి పద్మావతి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గార్ల సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్,గుజ్జువాయి సర్పంచ్ హెచ్ నాగేశ్వరరావు, పంచాయతీ సెక్రెటరీ చంటి, సచివాలయం సెక్రటరీ ఎ. గున్నారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆల్బెండా జోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పైలా శంకరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, ఆంగ్ల అధ్యాపకులు నారాయణరావు, తెలుగు అధ్యాపకులు బివిటి శ్రీనివాసరావు, పాల్గొన్నారు. సుమారు 450మంది విద్యార్థులకు ఆశా కార్యకర్తలు మహేశ్వరి, కన్యాకుమారి, ఆదిలక్ష్మి మాత్రలు పంపిణీ చేశారు.

గరుగుబిల్లి: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను కొమ రాడ ఐసిడిఎస్ సూపర్వైజర్ రౌతు లక్ష్మీ పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎఎన్ఎం బి.శ్రీదేవి అంగన్వాడీ వర్కర్లు పల్లా కృష్ణవేణి, రౌతు పద్మ, మూడడ్ల స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

భామిని : జాతీయ నులిపురుగులు దినోత్సవం దినోత్సవం సందర్భంగా భామిని, బత్తిలి, బాలేరు పిహెచ్ సి పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పాఠశాలల వైద్యాధికారులు దీపికారాణి, పసుపులేటి సోయల్, కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. భామిని పిహెచ్‌సి పరిధిలో 4264 మంది విద్యార్థులకు, బాలేరు పిహెచ్‌సి పరిధిలో 2394 మందికి విద్యార్థులకు ఈ మాత్రలను పంపిణీ చేశామన్నారు. ఇంకా ఎవరైనా విద్యార్థులు వివిధ కారణాలతో తప్పిపోతే ఈనెల 16న మాప్ అప్ కార్యక్రమం ద్వారా ఆల్బెండ జోల్ మాత్రలు పంపిణీ చేస్తామని వైద్యులు తెలిపారు.



పార్వతీపురంలో విద్యార్థినికి మాత్రలు వేస్తున్న డిఎంహెచ్‌ఒ జగన్నాధరావు

వీరఘట్టం : ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నులిపురుగు మందు వేసుకోవాలని ఎంఇఒ- 2 ఆర్.ఆనందరావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని కిమ్మి ఎంపియుపి పాఠశాలలో డి వార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు నులిపురుగు మందులు మింగించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.పారినాయుడు, బోనంగి వాసుదేవరావు, ఎఎన్ఎం రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజిపేట : అజ్జాడలో డీవార్మింగ్, జెఎఎస్ కార్యక్రమాలను జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి. జగన్ మోహనరావు తనిఖీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడాన్ని ఆయన పరిశీలించారు. ఒక పూర్తి మాత్రను మధ్యాహ్నం భోజనం తర్వాత విద్యార్థులందరూ మాత్రలు నమిలి తీసుకునేలా పర్యవేక్షణ చేశారు.



పాలకొండ ప్రభుత్వ జూనియర్‌కాలేజీ విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సీటుబెల్టు, హెల్మెట్ ధారణపై వంటి వాటిపై వాహన చోదకులకు మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, 40 మంది ఎన్ సిసి కేడెట్లుతో కలిసి శుక్రవారం స్థానిక బెలగాం కూడళ్లలో అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ ప్రమాదాలు, అధిక ప్రయాణికులతో ప్రయాణం, హెల్మెట్ ధారణ, సీట్ బెల్ట్, మద్యం సేవించి వాహనం నడపడం, ఓవర్ స్పీడ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. ఇతర రహదారి భద్రతపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎన్‌సిసి కేడెట్లతో వాహన డ్రైవర్లు, పాదచారులకు అవగాహన కల్పించారు. అలాగే హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు, సీట్‌బెల్ట్ ధరించి వాహనాలు వారికి గులాబీలు, చాక్లెట్ ఇచ్చి అభినందించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని, అధికలోడుతో ప్రయాణించిన ఆటో డ్రైవర్లుకు, ప్రయాణికులకు వాటివల్ల కలిగే రోడ్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. పాదచారులు రోడ్ దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో రవాణా శాఖ, మోటార్ ఇన్స్పెక్టర్లు ఎం.శశికుమార్, జి.సీతారాం, ఎన్.రమేష్‌కుమార్, ఎఒ పి.నారాయణరావు, మెడికల్ ఆఫీసర్ వి.వరప్రసాదరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవ్, ఎన్‌సిసి ఆఫీసర్ పివి రావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణ ప్రధాన రహదారి మీదుగా ఆర్టీసీ డిపో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. డిఎం భాస్కరరెడ్డి ఆధ్వర్యాన కండక్టర్లు, డ్రైవర్లు ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ సిఐ జిడి బాబు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. వాహనదారులు ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పిఎ రావు , కార్మికులు పాల్గొన్నారు.



సీటు బెల్టు పెట్టుకొన్న డ్రైవర్‌కు గులాబీ పువ్వు అందజేస్తున్న ఎన్‌సిసి విద్యార్థులు

పాలకొండ : వాహనాలు నడిపినప్పుడు జాగ్రత్తలు పాటిస్తూ భద్రతను పాటించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డిపో మేనేజర్ ఆధ్వర్యంలో డిపో నుండి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వరకు రోడ్డు భద్రతను సూచిస్తూ ఫ్లెక్సీలు, ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.లక్ష్మణరావు, బాసురు కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

లక్ష్మీపురంలో జెఎఎస్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి బి.జగన్నాధరావు మాట్లాడుతూ వచ్చే రోగాలకు వెనువెంటనే అన్ని పరీక్షలు చేసి ఆన్లైన్‌లోనే పొందుపరచాలన్నారు. ప్రతి రోగుకు వారి సమస్యలను తెలుసుకొని వారికి అవసరమైన వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. అన్ని విభాగాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఈశ్వరరావు, ఎఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, వైద్యాధికారులు ఎం.రాధాకాంత్, టి.హేమాక్షి, పి.పావని, సునీల్, వైద్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

బలిజిపేట : అజ్జాడలో నిర్వహించిన జెఎఎస్ ప్రోగ్రాంను జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జగన్ మోహనరావు తనిఖీ చేసి అక్కడ వివిధ కౌంటర్ల వద్ద రోగులకు అందజేస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. స్పాట్ సర్వే ద్వారా ఎంతమందికి చికిత్స అందజేశారు, ల్యాబ్ పరీక్షలు, రిఫరల్స్ తదితర వివరాలపై ఆరా తీశారు. అక్కడకు వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. మందులు వినియోగించే విధానాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించాలన్నారు. ఆరోగ్యశ్రీ చికిత్సపై అర్హులకు దిశా నిర్దేశం చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం ఎంపిడిఒ సిహెచ్. రామచంద్రరావునాయుడు కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జి.శశిధర్, సర్పంచ్ అక్కేన జగన్మోహన్, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ సంధ్య, కోటేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ జగన్మోహన్, ఇఒ నారాయణరావు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది,104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -భామిని

మండలంలోని కొండ పరిసర పోడు వ్యవసాయం చేసే గిరిజన గ్రామాల్లో అగ్ని ప్రమాద నివారణపై అవగాహన కార్యక్రమాన్ని అటవీశాఖ సిబ్బంది శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోడు వ్యవసాయ చేసే గిరిజనులు, కొండ పోడు వ్యవసాయ క్షేత్రాలు సిద్ధం చేసే క్రమంలో నరికిన మొక్కలు, చెట్లును, పొదలను, ఆకులను, తగలబట్టకుండా పెద్ద గోతుల్లో పోసి కుళ్ళబెట్టి కంపోస్ట్ ఎరువు చేసుకోవచ్చని అన్నారు. దీన్నివల్ల పొగ కాలుష్యం, అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు అని తెలిపి, అగ్ని ప్రమాద నివారణ కరపత్రాలు అతికించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారి లక్ష్మణమూర్తి, ఇతర అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

మహిళలు కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకుంటే కుటుంబం ఆర్థికంగా మెరుగుపడ్డానికి దోహదపడుతుందని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. మండలంలోని గోటివాడలో మహిళా వెల్ఫేర్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 45 రోజులు శిక్షణా కార్యక్రమం ఉంటుందని, దీన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటే వారు ఆర్థికంగా కొంత మెరుగుపడవచ్చని అన్నారు. ఇది కుటుంబ పోషణకు కొంత ఉపయోగపడుతుందని, కావున కుట్టు మిషన్ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పద్మ, స్థానిక సర్పంచ్ తిమ్మక తట్టమ్మ, ఎంపిటిసి సునీత, ఎస్.సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, మహిళలు పాల్గొన్నారు.

పూడికలు మేమే తొలగించుకోవాలా?

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పన్నులు మేమే కట్టాలి... పారిశుధ్య పనులు తామే చేసుకుంటే ఇక అధికారులు ఉండి ఎందుకని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాల్టీలోని 27వ వార్డులో గల కంగటివీధిలో ఉన్న మురుగు కాలువల్లో పూడుకతీతలు తొలగించకపోవడంతో కాలువలు చెత్త, వ్యర్థాలతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతూ దోమలకు నిలయాలుగా మారాయి. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రజారోగ్య విభాగం అధికారులు ఈ సమస్య పరిష్కారానికి కనీస చర్యలు తీసుకోవడంలేదు. గత్యంతరం లేక ఈ వార్డు వాసులే వారి వీధుల్లోని వీధి కాలువల్లో ఉన్న మురుగు, వ్యర్థాలను తన సొంత పనిముట్లతో తొలగించుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు స్పందించి పారిశుధ్య పట్టేందుకు వార్డులను పరిశీలించి సమస్యలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన కాలువలు శుభ్రం చేయాలని కోరుతున్నారు.



కాలువల్లో పూడిక తొలగిస్తున్న స్థానికుడు

గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారి ప్రదీప్ గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బరువు, ఎత్తు, రక్తపోటు, తదితర రకాలైన తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణీలకు సాయి భక్తులు భోజన సౌకర్యం కల్పించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతకుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఎన్నికల విధులను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని స్థానిక తహశీల్దార్ జనార్ధనరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లేబుల్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని, తాగునీరు, లైటింగ్, మరుగుదొడ్లు సదుపాయాలు ఉండేలా చూడాలని అన్నారు. భవనాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ చిట్టమ్మ, వివిధ గ్రామాల బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు

మక్కువలో భవిష్యత్తు గ్యారంటీ

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రమైన మక్కువలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం జరిగింది. టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. సాలూరు నియోజకవర్గ ఇన్చార్జ్ గుమ్మడి సంధ్యారాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి, ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ కి ఓటు వేసి చంద్రబాబు నాయుడును మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన సంధ్యారానికి మహిళలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జి.వేణుగోపాలనాయుడు, వివిధ గ్రామాల నుండి వచ్చిన పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలకొండ మండలం నుంచి టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షులు బిడ్డిక దమయంతి నాయుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సవర మాలయ్య, బిడ్డిక చందరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, టిడిపి మేనిఫెస్టో వివరించాలని అన్నారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి తోయక జగదీశ్వరి, ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, పోల్ మేనేజ్మెంట్ పోలూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం : సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వరి

సీతంపేట: మండలంలోని కుడ్డపల్లి పంచాయతీ వలగజ్జిలో పాలకొండ నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు పడాల భూదేవి బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలతో అవగాహన చేశారు. నియోజకవర్గం లో తెలుగుదేశం జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిపి బిడ్డిక జయలక్ష్మి, మాజీ కో ఆప్షన్ మెంబర్ మూర మోహన్, యువనాయకులు సవర అక్కరాజు, సవర సిమ్మయ్య, సవర గణేష్, మహిళలు, గ్రామస్తులు, అభిమానులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

ఎల్విన్ పేట కూడలి వద్ద ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 65 మద్యం సీసాలను శుక్రవారం జిల్లా టాస్క్ ఫోర్స్ సిఐ సింహాద్రి తమ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కురుపాంలో పత్రికా విలేకరుల తో మాట్లాడుతూ తమకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న తేనేటి ఈశ్వరరావు అనే వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేపట్టామని, రూ.13,150 విలువ చేసే మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నేరాలు ఘోరాలు

మద్యం బాటిళ్లు ధ్వంసం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పోలీస్ స్టేషన్లో 16 కేసుల్లో సంబంధించిన మద్యం బాటిళ్లను ఎఎస్పీ సునీల్ షరోన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధ్వంసం ఎస్ఐ ఎం.రమేష్ తెలిపారు. వీటిలో 87,324 బీరు బాటిళ్లు, ఒక కేసులో 1.75 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశామన్నారు.

12 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గురువునాయుడుపేట సమీపాన 12 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై పి నారాయణ రావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గురువునాయుడుపేట సమీపంలో పేకాట నిర్వహిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో శుక్రవారం గ్రామ సమీపంలో సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. దీంతో 12 మంది పేకాట రాయుళ్లు పట్టుబడగా, వారి నుంచి రూ.18100 స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్

ప్రజాశక్తి - భామిని

క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత లక్ష్యాలు చేరువచేయడానికి సులభతరం చేస్తుందని, మీరు ఉన్నత స్థితికి ఎదిగితే మీ కుటుంబ పరిస్థితులు కూడా ఉన్నత స్థాయికి ఎదుగుతాయని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ జి.ఎర్రం నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక కాలేజీలో ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, విద్యార్థినులు ఏక, సమూహ నృత్యలతో అలరించారు. ఈ కార్యక్రమం లో బోధన, బోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.